క్లుప్తంగా

దేవమ్మ తల్లి సంబరాలు ప్రారంభం



సూరప్పగూడెంలో ఘటాలకు పూజ చేస్తున్న భక్తులు

భీమడోలు: మండలంలోని సూరప్పగూడెం గ్రామ దేవత దేవమ్మ తల్లి ఐదు రోజుల సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆదివారం రాత్రి అమ్మవారిని పుట్టింటి నుంచి మేళతాళాలతో చలువబట్టలపై ఒడిగంటి బియ్యంతో డప్పు వాయిద్యాలు, కాంతారా, శక్తి వేషాలతో నడుమ అమ్మవారిని ఊరేగిస్తూ తీసుకొచ్చారు. సంబరం నిర్వహించారు. ఇళ్ల వద్దకు వచ్చిన ఇఅమ్మవారి ఘటాలకు భక్తులు పూజలు చేశారు. పసుపు నీళ్లతో జలాభిషేకం చేశారు. నైవేధ్యాలను సమర్పించుకున్నారు.

అట్రాసిటీ చట్టంపై విస్తృత ప్రచారం

దెందులూరు: ఏలూరు డివిజన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నివారణకు అట్రాసిటీ చట్టంపై విస్తృత అవగాహన కల్పిస్తామని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ మెంబరు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం అన్నారు. మంగళ వారం జోగన్నపాలెంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. అట్రాసిటీ కేసులు నమోదయ్యే పరిస్థితి రాకుండా నూతన కమిటీ, విద్యా సంస్థలు, ఎన్జీఓలు, గ్రామ శివారు ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు సామాజిక న్యాయం, చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని లీలానవకాంతం తెలిపారు.

అమృత కలశ యాత్ర

గణపవరం: దేశం కోసం, ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి అన్నారు. మంగళవారం గణపవరం మండల కార్యాలయం వద్ద నెహ్రూ యువకేంద్రం, ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో గణపవరం బ్లాక్ స్థాయిలో నిర్వహించిన ఆజాదీకా అమృత్ మహోత్సవ కలశయాత్రను వారు ప్రారంభించారు. ప్రదర్శనలో పాల్గొన్నారు. దేశభక్తి చాటుతూ నినాదాలు చేశారు. కలశాన్ని జిల్లా కేంద్రానికి అందజేయనున్నట్టు ఎంపీడీఓ జ్యోతిర్మయి తెలిపారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

భర్త మరణించాడనే బెంగతో..

ఏలూరు టౌన్: భర్త మరణించటంతో తీవ్ర మానసిక వేదనకు గురై ఓ మహిళ బలన్మరణానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. తణుకు పాతూరుకు చెందిన బొద్దాని వెంకటరమణ (53) భర్త ధనరాజు ఈనెల 10న అనారోగ్యంతో మరణించాడు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్తపై బెంగతో మానసికంగా కుంగిపోయింది. ఇక తాను జీవించి ఉండలేనంటూ ఈనెల 23న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను తణుకు ప్రభుత్వాసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యచికిత్సకు ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటరమణ మృతిచెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవానీలకు అన్నదానం

దెందులూరు: దేవీ నవరాత్రులు సందర్భంగా భవానీ భక్తులు ఐదు వేల మందికి గుండుగొలనుకు చెందిన రుద్రరాజు లచ్చిరాజు, కృష్ణవేణి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు రుద్రరాజు రవికుమార్‌రాజు, మధుసూదనరాజు ఆధ్వర్యంలో అన్నదానం, మజ్జిగ, తాగునీరు అల్పాహారం పంపిణీ చేశారు. మంగళవారం గుండుగొలను ఫ్లైఓవర్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఏటా అన్నదానం చేస్తున్నట్టు దాతలు తెలిపారు.

ముగిసిన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు



పవర్‌పేట విశ్వేశ్వర స్వామి ఆలయంలో వజ్రకవచ అలంకరణలో అమ్మవారు



పవర్‌పేట వాసుదేవాలయంలో రజతకవచ అలంకరణలో రాజ్యలక్ష్మి



పత్తేబాదలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



బావిశెట్టివారిపేటలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ

వివిధ అలంకరణల్లో అమ్మవార్ల దర్శనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాల్లో ఉదయం నిత్యపూజలు, కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణలు, శ్రీ దేవీ ఖడ్గమాల పారాయణలు నిర్వహించారు. శమీ పూజలు నిర్వహించి నగరోత్సవాలు నిర్వహించారు. పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి ఉభయ దాతలచే అలంకార పూజ చేశారు. భక్తుల గోత్ర నామాలతో సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి కాశీ అన్నపూర్ణ దేవికి వజ్ర కవచాలంకరణ చేశారు. అమ్మవారికి విశేష పుష్పాలంకరణ, వివిధ రకాల పండ్లు, పిండి వంటలు, కూరగాయలు, డ్రై ఫ్రూట్స్ వంటి మధుర పదార్థాలతో మహానివేదన సమర్పించారు. సాయంత్రం శమీ వృక్ష పూజ, ధూప సేవ నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అర్చకులు కందుకూరి రామ బ్రహ్మానందశర్మ విశేష పూజలు చేయగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు. పవర్‌పేట వాసుదేవాలయం ప్రాంగణంలోని రాజ్యలక్ష్మి అమ్మవారికి ఉదయం క్షీరాభిషేకం, ఉభయ దాతలచే విశేష పూజలు, నిత్య పూజలు చేశారు. అమ్మవారికి నిజరూప రజత కవచాలంకారం చేశారు. బాలభోగ వినియోగం, సాయంత్రం లక్ష్మి, లలితా సహస్రనామ పారాయణ చేసి, శమీ పూజ నిర్వహించారు. విశేష హారతులు, ఏకాంత సేవ చేశారు. అర్చకులు కందుకూరి వెంకట విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామచంద్రరావుపేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో అమ్మవారికి రాజరాజేశ్వరి దేవి అలంకరణ చేసి తెలుపు చామంతి, వివిధ రకాల పూలతో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో వై.శివలక్ష్మి బృందం బుర్రకథా కాలక్షేపం చేశారు. పత్తేబాద కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి రాజరాజేశ్వరి దేవి అలంకరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. బావిశెట్టివారిపేటలో కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి రాజరాజేశ్వరీ దేవి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

27న నాయీబ్రాహ్మణ కళ్యాణ మండప శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకుడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో నాయీబ్రాహ్మణ కళ్యాణ మండపం నిర్మాణానికి ఈ నెల 27న శంకుస్థాపన చేయనున్నట్టు నాయీబ్రాహ్మణ నంద యువసేన జిల్లా ఇన్‌చార్జి రంభా రాజా తెలిపారు. స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో మంగళవారం నిర్వహించిన నాయీబ్రాహ్మణ నంద యువసేన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని నాయీబ్రాహ్మణ కళ్యాణ మండపం నిర్మాణానికి మాదేపల్లి ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2లో స్థలం కేటాయించారని, అక్కడ ఎంపీ, ఎమ్మెల్యేల నిధులు, దాతల సహకారంతో కళ్యాణ మండపం నిర్మించనున్నామని తెలిపారు. ఈ నిర్మాణానికి ఈ నెల 27న ఉదయం 10 గంటలకు శంకుస్థాపన నిర్వహించనున్నామని, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్య చౌదరి, ఎంపీ కోటగిరి శ్రీధర్, తదితర ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. నాయీ బ్రాహ్మణులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు తాడివలస పవన్ కుమార్, చిట్టాబత్తుల శ్రీను, కొండూరు రామచంద్రరావు, రంభా సతీష్, కొడవర్తి సూర్యచంద్ర రాజు, రంభా మురళి పాల్గొన్నారు.

న్యాయవాది చిరంజీవికి అభినందన



చిరంజీవిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (టూటౌన్): న్యాయ విభాగంలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకున్న స్థానిక సత్రంపాడుకు చెందిన న్యాయవాది పుల్లగోర చిరంజీవిని ఎమ్మెల్యే ఆళ్ల నాని అభినందించారు. చిరంజీవి ఎమ్మెల్యే నానిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ చిరంజీవి డాక్టరేట్‌ను రాష్ట్ర గవర్నర్ చేతులు మీదుగా అందుకోవడం అభినందనీయమన్నారు. ఏలూరు కీర్తి ప్రతిష్టలు పెంచే విధంగా ఇటువంటి డాక్టరేట్‌లు, అవార్డులు అందుకోవడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ దిరిశాల వరప్రసాద్, వేము మురళీకృష్ణ, రిటైర్డ్ ఎమ్మార్వో మాదాసు వెంకటేశ్వర నాయుడు, పి.శ్రీనివాస్, ఎస్.జాన్సన్, జి.స్వామినాయుడు, ఎస్.దుర్గారావు, పి.నాగమురళి, ఎ.రత్నం, ఎం.భూషణం, ఎస్ సురేష్, పి.మస్తాన్‌రావు, సి.భీమేశ్వరరావు, కె.కృష్ణారావు, పితాని దుర్గాప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

29న కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆ సంస్థ 45వ కార్యక్రమంగా ఈ నెల 29న కళాకారుల సాంస్కృతిక కళాసమ్మేళనం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోదుగు కృష్ణారావు, పెదపాటి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా నగరానికి చెందిన నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్యబృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన, అనంతరం రంగస్థల నటి సీహెచ్ లలితా కుమారి ద్రౌపది ఏకపాత్రాభినం, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం, రామకృష్ణ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌పీఎస్ వాసు మ్యూజిక్ అకాడమీ కళాకారులు అక్కినేని సినీ సంగీత లహరి కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు వైఎంహెచ్‌ఏ హాలులో జరిగే ఈ కార్యక్రమాల్లో తొలుత మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వరరావుకు గౌరవ సత్కారం ఉంటుందని, అనంతరం గుప్తా ఫౌండేషన్ సౌజన్యంతో కళాకారులు పౌరాణిక నటి సీహెచ్ లలిత కుమారి, తబలా కళాకారుడు గుడిపూడి శ్యాంబాబు, టెక్నీషియన్ టి.స్వామి, నృత్య కళాకారిణి సయ్యద్ హసీనాలకు ఆర్థిక సత్కారం చేయనున్నామని తెలిపారు. కళాకారులు, కళాభిమానులు, కళాపోషకులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వెల్లమిల్లిలో అగ్నిప్రమాదం

ఉంగుటూరు: వెల్లమిల్లిగ్రామంలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. మారిన శ్రీనివాసు ఇంటిలో గ్యాస్‌లీకై మంటలు వ్యాపించాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

దెందులూరు: స్థానిక ఎస్ఎంఆర్ నగర్ గ్రామ సచివాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే ప్రజలకు మేలు



భీమడోలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు: వైఎస్సార్ సీపీ హయాంలోనే ప్రజలకు మేలు జరిగిందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలులో సోమవారం రాత్రి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే అంశంపై మండల స్థాయి ముఖ్యనేతలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లుతో ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీ నేతలు చేపట్టాల్సిన విధి విధానాలను డిజిటల్ స్క్రీన్‌పై వివరించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా అర్హులందరికీ నిరాటంకంగా గడపగడపకు పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాలతో మమ్మేకం కావాలని, రాత్రి బస్ చేయాలని సూచించారు. విద్య, వైద్య రంగాల్లో ఎన్నో సంస్కరణలతో సీఎం జగన్ మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు. జగనన్న సురక్ష సేవల ద్వారా 96 లక్షల మందికి ఉచితంగా అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను అందించారని వివరించారు. ఇంగ్లిషు నేర్చుకోవాలంటే యూట్యూబ్ చూస్తే సరిపోతుందని అవగాహన లేమితో పవన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. టీడీపీ, పవన్ అనైతిక పొత్తుపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. చంద్రబాబు వస్తే అభివృద్ధి, సంక్షేమం నిలిచిపోతుందని వివరించారు. అమరావతిలో టీడీపీ నాయకులు ఉద్యమాన్ని డబ్బులిచ్చి నడిపిస్తున్నారని ఆరోపించారు. సీఎం జగనన్నను ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి 45 రోజులు పాటు సచివాలయ పరిధిలోని గృహాల సందర్శన, పార్టీ జెండాల ఏర్పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ జూనియర్, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, సర్పంచులు షేక్ రహిమాబేగం హసేనా, దాయం సుజాత ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీలు అంబటి దేవీ ప్రసాద్, ఆల్తి గోపి, గంటా శ్రీనివాస రావు, పాల్నాటి శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకటకృష్ణారావు, గుండుగొలను ఉప సర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ స్థాపనే లక్ష్యం



పూళ్లలో ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందిస్తున్న మానవత ప్రతినిధులు

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే మానవత లక్ష్యమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకర్ అన్నారు. మండలంలోని పూళ్ల శాఖా గ్రంథాలయంలో మంగళవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం భీమడోలుకు చెందిన నిరుపేద కొల్లేపర నాగేశ్వరరావుకు మందుల ఖర్చుల నిమిత్తం రూ.4 వేలు, కురెళ్లగూడెంలోని దీర్ఘకాలిక వ్యాధి బాధితుడు దేవర అప్పారావు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. పలు కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సాయిరామ్ అధినేత పున్నెం గోపి బాధిత కుటుంబీకులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మండల చైర్మన్ గుల్లా నూకరాజు, మండల కార్యదర్శి అడబాల శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పులిచర్ల వెంకటకృష్ణారావు, జిల్లా కార్యదర్శి అల్లాడ ప్రసాదరావు, జిల్లా కోఆర్డినేటర్ ఆర్ గంగాధరరావు, ఈసీ సభ్యుడు కేతినీడి విశ్వేశ్వరరావు, డోకల పెదచిన్నారావు, పచ్చా వెంకటేశ్వరరావు, యాసా వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాము

గణపవరం: మండల పరిషత్ సమావేశాలకు పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన గణపవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అర్ధవరం రాము అధ్యక్షత వహించి మాట్లాడారు. బాధ్యులైన అధికారులు రాకపోతే సభ్యుల సమస్యలకు పరిష్కారం ఎలా లభిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకునేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ జ్యోతిర్మయి మాట్లాడుతూ మండల సమావేశాలకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సిందేనని, గైర్హాజరైతే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పలువురు సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొవచ్చారు. గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అన్నారు. మురుగునీటి పారుదల, మంచినీటి చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరనాథ్‌రాజు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనులకు టెండర్లు రానిచోట్ల డ్వాక్రా గ్రూపులతో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మండల స్త్రీ శక్తి భవనం మొదటి అంతస్తు నిర్మాణం పూర్తికి నిధులు మంజూరు చేయాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, వైస్ఎంపీపీ సలాది రత్నకుమారి, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ పి.వెంకటలక్ష్మి, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు చనుమూరి లక్ష్మిభవాని తదితరులు పాల్గొన్నారు.

భవానమ్మకు రూ.1.11 లక్షల విరాళం

భీమడోలు: పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలవేల్పు భవానమ్మ దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు మహిషాసురమర్ధని, రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఎంఎంపురం గ్రామానికి చెందిన దైవసేవకులు పెద్దిరెడ్డి నారాయణమూర్తి అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి రూ.1,11,116 విరాళంగా ఆలయ కమిటీ నిర్వాహకులకు మంగళవారం అందజేశారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సీపీఎం రూపొందించిన ప్రజా ప్రణాళికను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఇటీవల విజయవాడలో సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్వహించిన సెమినార్స్‌లో వచ్చిన అనేక అభిప్రాయాలను క్రోడీకరించి ప్రజా ప్రణాళికను రూపొందించిందని తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని విమర్శించారు. ప్రజా ప్రణాళికపై సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో బస్సు యాత్రలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నవంబరు 5న జిల్లాలోకి బస్సు యాత్ర ప్రవేశించి 6, 7 తేదీల్లో పర్యటిస్తుందని, 15న విజయవాడలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.కిషోర్, బి.సోమయ్య, కె.శ్రీనివాస్, ఎస్ సత్యనారాయణ, మీసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ శిక్షణకు డీపీఆర్‌టీయూ నేత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉన్నత పాఠశాలల్లో అభివృద్ధి, అక్షరాసత్య పెంచే కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 26 నుంచి 28 వరకు ఢిల్లీలోని శాస్త్రి భవన్‌లో నిర్వహించే ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) శిక్షణ తరగతులకు నగరానికి డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక డీ పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఆయనకు ఆ సంఘ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపి వీడ్కోలు పలికారు. ఆయనకు డీఈఓ పి.శ్యామ్ సుందర్ అభినందనలు తెలిపారు.

ఎస్‌బీ సీఐగా మల్లేశ్వరరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మల్లేశ్వరరావును నియమిస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్‌బీ సీఐగా పనిచేస్తోన్న ఎం.సుబ్బారావును డీసీఆర్‌బీ సీఐగా బదిలీ చేస్తున్నట్టు తెలిసింది. చింతలపూడి సీఐగా పనిచేస్తోన్న మల్లేశ్వరరావును ఎస్‌బీ సీఐగా బదిలీ చేశారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మంగళవారం ఎస్‌బీ సీఐ సుబ్బారావు బాధ్యతల నుంచి రిలీవయినట్టు తెలుస్తోంది.

జూదరుల అరెస్ట్



శిబిరం వద్ద జూదరులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఏలూరు టౌన్: నగరంలో టూటౌన్ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఈబీ పోలీసులు మంగళవారం దాడులు చేశారు. గూడ్స్‌షెడ్ రోడ్డులో పేకాట శిబిరం వద్ద 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.8340 నగదు, 10 సెల్‌ఫోన్లు, 5 మోటారు సైకిళ్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. జూదరులను ఏలూరు టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

చదవడం నా కిష్టం

దెందులూరు: పోతునూరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం చదవడం నా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. పుస్తకాలు, పత్రికలు చదివించడంతో పాటు కంప్యూటర్ బేసిక్ నేర్పిస్తున్నట్టు గ్రంథాలయాధికారి రాంబాబు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

అమరవీరుల ఆశయాలను సాధిద్దాం

పెదపాడు : అమరవీరుల ఆశయ సాధనకు పనిచేయడమే నిజమైన నివాళని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. పెదపాడు మండలం నాయుడుగూడెంలో అమరవీరుడు గారపాటి రాజారామ్మోహనరావు 77వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. 1946లో నాటి కాంగ్రెస్ భూస్వాముల దాడిలో కత్తిపోటుకు గురై అమరుడయిన రాజారామ్మోహనరావు త్యాగం వృథా కాదని, ఆయన ఎత్తిన ఎర్ర జెండా కష్టజీవుల హక్కుల పోరాటాలు కొనసాగిస్తోందని రవి వివరించారు. రాజారామ్మోహనరావు పోరాటస్ఫూర్తి ఆదర్శనీయమన్నారు.

షాపులు లైసెన్స్, ఫీజులకు వేలం ప్రకటన

[illegible]

క్ర.సం.	షాపు నెం. ప్రదేశం	ధరావత్తు	లైసెన్స్ కాలపరిమితి	వేలం పాట తేది, సమయం, ప్రదేశం
1.	[illegible]	10,000/-	[illegible]	ది.09.11.2023 [illegible] 10.30 [illegible]
2.	[illegible]	6,000/-	[illegible]	ది.09.11.2023 [illegible] 11.00 [illegible]
3.	[illegible]	5,000/-	[illegible]	ది.09.11.2023 [illegible] 11.30 [illegible]

[illegible]

ఏలూరు
ది.20.10.2023

కార్యనిర్వహణాధికారి,
[illegible]

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	00
డీ.తిరుమల ఏలురు బీహెచ్ఈఎల్	22.15	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	25

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	00
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	20
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	98512	39
ఏలూరు బీహెచ్ఈఎల్	22.30	98505	35
ఏలూరు -తిరుపతి	16.00	4830	30